# సాక్షి
# వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం | 28 | జనవరి | 2024






## పూడికతీత పనులు చకచకా

పులివెందుల బ్రాంచ్ కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. ఈ కాలువ కింద 40 కి.మీ మేర పూడిక తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. -IIలో



## వైఎస్సార్‌సీపీలో చేరిక

కొండాపురం మండల పరిధిలోని పాత కొండాపురానికి చెందిన 50 కుటుంబాల వారు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. -IIలో

గరిష్టం/కనిష్టం
33.0/19.7

## వాతావరణం

జిల్లాలో శనివారం 19.7 - 33.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### 30న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: తమ కార్యాలయంలో ఈనెల 30వ తేది ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంకు, ఎల్ఐసీ, బైజూస్ కంపెనీలు ఇంటర్వ్యూలు రానున్నాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 10–37 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### పురాతన చర్చి సందర్శన



చర్చి విశిష్టత గురించి విదేశీయులకు వివరిస్తున్న విచారణ గురువులు

కలసపాడు: స్థానిక సగిలేరు ఒడ్డున ఉన్న పురాతన చర్చి పరిపేతురు పరిపాలు చర్చిని శనివారం అమెరికా దేశస్తులు ఎలిజబెత్‌బ్రౌన్, డేవిడ్‌లీసె, థామస్, పెట్రిసియా, డైనోల్ఫోలు సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి విశిష్టత గురించి విచారణ గురువులు వారికి వివరించారు. కార్యక్రమంలో రెవ. సంజయ్ మధు, రెవ. అబ్రహం‌ప్రేమ్‌చంద్, కె.జె.ప్రవీణ్ (చిన్ను), చిత్తారాజశేఖర్‌రెడ్డి, ప్రభావతి, శ్రీనివాసులరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మెరిట్ జాబితా విడుదల

కడప రూరల్: ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఈ జాబితాను హెచ్ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీలోపు కడప పాత రిమ్స్‌లో గల వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో స్వయంగా, లేదా ఎంఎల్‌హెచ్‌పీఆర్ఈసీటీ అట్‌ది రేటాఫ్ జీమెయిల్.కం వెబ్ సైట్ ద్వారా తెలుపవచ్చని పేర్కొన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన ఫైనల్ మెరిట్, ప్రొవిజనల్ సెలక్షన్ జాబితాను విడుదల చేస్తామన్నారు. ఈ జాబితాపై 9వ తేదీలోపు అభ్యంతరాలను తెలపవచ్చన్నారు. 12న ఫైనల్‌గా అభ్యర్థిల ఎంపిక జాబితాను ప్రకటించి, 14న నియామక కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని చెప్పారు.

### చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలి



చిరుధాన్యాలతో చేసిన అలంకరణను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు

మైదుకూరు: ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ సి.కరుణశ్రీ తెలిపారు. మైదుకూరు మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో(కేవీకే) శనివారం చిరుధాన్యాల మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణశ్రీ మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలను సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. నాబార్డ్ డీడీఎం విజయవిహారి మాట్లాడుతూ రైతులకు అవసరమైన చిరుధాన్యాల విత్తన రకాలను సరఫరా చేసేందుకు కృషి విజ్ఞాన కేంద్రం కృషి చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి మైఖేల్ రాజీవ్, మేనేజ్ నోడల్ అధికారి డాక్టర్ కృష్ణారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడారు. మేళాలో చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలియజేసే బుక్‌లెట్లను ఆవిష్కరించారు. మేళాలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీవిద్యారాణి, ఫిరోజ్ హుస్సేన్, డాక్టర్ లావణ్య, డాక్టర్ ప్రశాంతి, కాంతిశ్రీ, ఆయిల్ పామ్ జిల్లా మేనేజర్ కొండారెడ్డి, గంగయ్య, బీపీ ప్రతాప్‌రెడ్డి, మైదుకూరు వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న, ఉద్యాన అధికారి రామకృష్ణ, కాశినాయన వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్ స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

# ఈ క్రాప్..రైతు సేఫ్

- ఈ–క్రాప్ వంద శాతం, ఈకేవైసీ 51 శాతం పూర్తి
- ఫిబ్రవరి 15తో నమోదుకు గడువు పూర్తి
- అన్నదాతలు సత్వరం నమోదు చేసుకోవాలంటున్న అధికారులు





కడప మండలం రూకవారిపల్లెలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్

కడప అగ్రికల్చర్: వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రైతులకోసం గ్రామీణ ప్రాంతాల్లో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా విత్తనాలు మొదలుకుని పంట దిగుబడి చేతికొచ్చే వరకు అన్ని రకాల సేవలందిస్తోంది. రైతు భరోసా ద్వారా నేరుగా వారి ఖాతాల్లో నగదు జమచేసి సాగుకు సాయంగా నిలిస్తోంది. దీంతోపాటు అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలను అందించాలనే లక్ష్యంలో ఈ క్రాప్ పేరుతో పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను నేరుగా రైతు పొలం వద్దకే వెళ్లి సేకరిస్తోంది. ఆర్‌బీకే పరిధిలో అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిసెంట్స్ ద్వారా ఈ క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ పక్రియ జిల్లాలో చివరి దశకు చేరుకుంది. ఈ క్రాప్ నమోదుకు ఫిబ్రవరి 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. ఇంకా ఎవరైనా ఈ క్రాప్ నమోదు చేసుకోని వారు ఉంటే తక్షణం చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**రబీ సాగుకు సంబంధించి..**

జిల్లాలో 36 మండలాల పరిధిలోని 432 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో రబీ సీజన్‌లో 2,50,245 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. వీటికి సంబంధించి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్లు.. భూమికి సంబంధించిన వివరాలు సేకరించి ఆధార్ బేస్ డేటాను అనుసంధానం చేశారు. 2,50,245 ఎకరాలకు ఈ క్రాప్ పూర్తి చేశారు. ఇందులో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు 2,50,245 ఎకరాలకు 2,35,870 ఎకరాలకు అథెన్‌టిక్ పూర్తి చేసి 94 శాతం, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ 2,50,245 ఎకరాలకు 2,21,466 ఎకరాలకు పూర్తి చేసి 94 శాతం నమోదు చేశారు. అలాగే ఈకేవైసీకి సంబంధించి 2,50,245 ఎకరాలకు 1,11,845 ఎకరాలకు పూర్తి చేసి 51 శాతం నమోదు చేశారు. మిగతా 49 శాతాన్ని ఫిబ్రవరి 15వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఈ పక్రియను సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**ఇవీ ప్రయోజనాలు...**

పంట నమోదు వల్ల వరదలు, తుపాన్ల సమయంలో పంటలకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతోంది. అంతేకాక పంటల బీమా కావాలన్నా, సున్నా వడ్డీకి పంట రుణాలు, రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు తీసుకోవాలన్నా ఈ క్రాపులో నమోదు తప్పని సరి. పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నా ఈ క్రాపు చేసి ఉండాలి.

### ఫిబ్రవరి 15లోగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలి



రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు తప్పని సరిగా చేయించుకోవాలి. ఈ క్రాప్ నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ ప్రయోజనాలకు అర్హత లభిస్తుంది. ప్రస్తుతం రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఈ క్రాప్ బుకింగ్ వందశాతం పూర్తయింది. ఈకేవైసీ 51 శాతం మేర పూర్తయింది. ఇంకా ఈకేవైసీ చేయించుకోని రైతులు ఫిబ్రవరి 15వ తేదీలోపు చేయించుకోవాలి. – అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి. వైఎస్సార్‌జిల్లా

# మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

**ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా**

కడప కార్పొరేషన్: మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైయస్ జగన్‌హన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా పేర్కొన్నారు. శనివారం కడప మరియాపురం లూర్దుమాత చర్చి మైదానంలోని యం.డి.ప్రకాశం కళావేదికలో కడప నగరపాలక సంస్థ, మెప్మా వారి ఆధ్వర్యంలో 4 వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ....' వైఎస్సార్ ఆసరా'ద్వారా నాలుగో సంవత్సరం కూడా 35525 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.32.81కోట్లు జమ చేసినట్లు చెప్పారు. ఈ నాలుగేళ్లలో కడపలోని లబ్ధిదారులకు సుమారు రూ.100 కోట్లను ఈ పథకం కింద అందించామన్నారు. గత ప్రభుత్వాల వలే ఇది మాటల ప్రభుత్వం కాదని, ఇది చేతల ప్రభుత్వం అని అన్నారు. మేనిఫెస్టో అంటే అంకెల గారడీ కాదని.. అది ఒక పవిత్రమైన భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావిస్తున్నామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తామని, రుణాలు కట్టొద్దని పిలుపునిచ్చి తరువాత మోసం చేసిన పరిస్థితుల్లో.. మహిళలు ఆ ఋణాలు కట్టలేక, చివరకు వడ్డీ కూడా చెల్లించలేక, రుణభారం తడిసి మోపెడైందన్నారు. ఫలితగా మహిళా సంఘాలు చిన్నాభిన్నమై 'ఎ'గ్రేడ్ లో ఉన్న సంఘాలు కూడా 'సి'. 'డి'గ్రేడ్ లోకి పడిపోయాయన్నారు. మహిళల ఆర్థిక ఇబ్బందులను ఎన్నికల ముందు పాదయాత్రలో కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంకు రుణా మొత్తం ఎస్ఎల్‌బీసీ వారి తుది జాబితా ప్రకారం 7.98 లక్షల మహిళా సంఘాల్లోని 78.94 లక్షల అక్క చెల్లెమ్మలకు ఉన్న అప్పు నిల్వ రూ. 25, 571 కోట్లను 4 దఫాలుగా నేరుగా పొదుపు సంఘాల ఖాతాల ద్వారా అందిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట చిత్తశుద్ధితో అమలు పరిచారన్నారు. అమ్మఒడి. విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, సున్నా వడ్డీ, కాపు నేస్తం, కళ్యాణమస్తు, ఇళ్ళ పట్టాలు అక్కచెల్లమ్మల పేరుతోనే ఇస్తున్నారని, అన్ని నామినేషన్ పోస్టులల్లో మరియు నామినేటేడ్ పనులలో చట్టం చేసి 50 శాతం మహిళలకు కేటాయించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు ఆర్.బాలస్వామిరెడ్డి, షఫీ, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, క్రిష్ణవేణి, కార్పొరేటర్ బాలస్వామి రెడ్డి మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులిసునీల్, డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ వినోద్ కుమార్, చల్లా రాజశేఖర్, జమాల్‌వలీ, త్యాగరాజు, దేవిరెడ్డి ఆదిత్య, అల్ఫోన్స్, బండి మరియలు, సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం స్వయం సహాయ సంఘాల మహిళలకు నాలుగు విడతల్లో పూర్తి రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.



స్వయం సహాయ సంఘాల మహిళలకు మెగా చెక్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

# పుత్తాకు రెడ్‌సిగ్నల్..!

- కమలాపురం టీడీపీలో 'వీరశివా'మంటలు
- రా...కదిలిరా కార్యక్రమంలో ఇన్‌చార్జి పుత్తాకు నిరాశ

సాక్షి ప్రతినిధి, కడప: కమలాపురం తెలుగుదేశం పార్టీలో రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అభ్యర్థిత్వానికి రెడ్‌సిగ్నల్ పడింది. ఇంతకాలం అభ్యర్థిత్వానికి అడ్డు లేదనుకున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి రూపంలో పెద్ద గండం ఎదురైంది. రా...కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేసినా అధినేత నుంచి పుత్తాకు ఆదరణ కరువైంది. అంతటి కార్యక్రమంలో ఎక్కడ పుత్తా పేరు ఎత్తకుండా చంద్రబాబు కార్యక్రమాన్ని ముగించారు. అప్పట్లో అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. అంతలోనే అనూహ్యంగా మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి మెడలో చంద్రబాబు టీడీపీ కండువా వేశారు.

- కమలాపురం టీడీపీ ఇన్‌చార్జిగా 2009 నుంచి పుత్తా నరసింహారెడ్డి సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నారు. మొత్తం నాలుగు సార్లు, టీడీపీ అభ్యర్థిగా మూడు పర్యాయాలు కమలాపురంలో ఓటమి చెందారు. ఈనేపథ్యంలో మరోమారు టీడీపీ అభ్యర్థిగా పుత్తా పోటీ చేయనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈనెల 19న రా...కదిలిరా కార్యక్రమాన్ని కమలాపురంలో నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా ముసిగిందన్న సంతోషం కంటే, ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి విజయానికి కృషి చేయండని కార్యకర్తలకు చంద్రబాబు పిలుపు ఇవ్వలేదనే బాధ తెలుగుతమ్ముళ్లల్లో అధికంగా ఉండిపోయింది. అప్పట్లో అభ్యర్థిత్వం ప్రకటించకపోవడానికి కారణాలు ఏమిటో వారికి అంతుపట్టలేదు. తాజాగా శుక్రవారం చంద్రబాబు పుత్తాతో నిమిత్తం లేకుండా కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి మెడలో కండువా వేయడంతో ఒక్కమారుగా తెలుగుతమ్ముళ్ల ఆశ్చర్యానికి గురయ్యారు.

### పుంజుకోని పుత్తా...సర్వేల్లో వెనుకంజ...

2009 నుంచి తెలుగుదేశం పార్టీ కమలాపురంలో వరుసగా ఓటమి చెందుతోంది. ఇలాంటి నియోజకవర్గాలపై టీడీపీ అధిష్టానం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈమారు ఆ నియోజకవర్గాల్లో టీడీపీ గెలుస్తోందా.. లేదా... అన్న విషయంపై ప్రత్యేక టీమ్‌ల ద్వారా సర్వేలు చేయించింది. పుత్తా నరసింహారెడ్డి అభ్యర్థిత్వంపై సర్వే చేయించగా ఆశించిన ఫలితాలు దక్కలేదని విశ్వసనీయ సమాచారం. పైగా వరుసగా నాలుగుసార్లు ఓడిపోయిన నేతలకు టికెట్ ఇచ్చేది లేదని ఇదివరకే నారా లోకేష్ ఓమారు ప్రకటించారు. ఈపరిస్థితుల్లో అధినేత చంద్రబాబు పునరాలోచనలో పడ్డారా? అన్న సందేహం తెలుగుతమ్ముళ్లల్లో లేకపోలేదు. తాజాగా కమలాపురం సభలో కూడా పుత్తా పేరు ఉచ్ఛరించకపోవడానికి కూడా అదే కారణమా? అన్న సందిగ్ధత కూడా టీడీపీ నేతలను వెంటాడుతోంది. పుత్తా అభ్యర్థిత్వం ప్రకటించకపోయినా, తమ ప్రమేయమే లేకుండా మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డిని టీడీపీలో చేర్చుకోవడంపై పుత్తా వర్గీయులు రగిలిపోతున్నారు. మరోమారు తమ నేతలకు వీరశివా అడ్డంకిగా మారారనే ఆవేదనతో ఉన్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

# 29 నుంచి విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రొద్దుటూరు: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన ఆదాయ, అవసరాల, విద్యుత్ చార్జీలపై ఈనెల 29, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీలలో ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీఈఆర్సీ ఉన్నతాధికారులు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు స్థానిక పవర్ హౌస్ రోడ్డులోని విద్యుత్ ఎగ్జిక్యూటీవ్ కార్యాలయంలో ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వ్యవధిలో హాజరై తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలపాలని కోరారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యం

**ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి**

చెన్నూరు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన చెన్నూరు మండలంలోని ఉప్పరపల్లి మెయిన్ రోడ్డు వద్దనుంచి పుష్పగిరి వరకు తొమ్మిది కోట్ల 80 లక్షల రూపాయలతో నిర్మించిన డబుల్ రోడ్డును కలెక్టర్ విజయరామరాజుతో కలసి ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెన్నూరు మండలాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉప్పరపల్లి శివాలయం వెనుక భాగంలో, శివాలపల్లె వంక వద్ద బ్రిడ్జిలు నిర్మించినట్లు చెప్పారు. అంతే కాకుండా రిటైర్డ్ ఫారెస్ట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎర్రసాని మధుసూదన్ రెడ్డి( స్థల దాత) సహాయ సహకారాలతో రైతులకు ధాన్యాన్ని నిలువ ఉంచుకునేందుకు రూ. 80 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల గోడౌన్‌ను నిర్మించామన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా అక్కడి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, రిటైర్డ్ అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎర్రసాని మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేష్ కుమార్, ఆర్డీవో మధుసూదన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎస్ఈపీ మహేశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండల అధ్యక్షులు ఎర్రసాని మోహన్‌రెడ్డి, ఎంపీపీ,చీర్ల సురేష్ యాదవ్, ముదిరెడ్డి రవిరెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ ఎర్రసాని నిరంజన్ రెడ్డి, సర్పంచ్ ముమ్మడి సుదర్శన్ రెడ్డి, పుల్లయ్య యాదవ్, తహసిల్దార్ పఠాన్ అలీఖాన్, డీఎఫ్ఓ సుధీర్ పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, కలెక్టర్ విజయరామరాజు

# నేటి నుంచి కబడ్డీ సమరం



ఉత్సాహంగా క్రీడాప్రాంగణానికి చేరుకుంటున్న క్రీడాకారులు

- పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం
- వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన క్రీడాకారులు

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో ఆదివారం నుంచి ఎస్‌జీఎఫ్ అండర్–14 67వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే పోటీల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు శనివారం రైలుమార్గం ద్వారా వారి ప్రాంతాల నుంచి రాజంపేటకు చేరుకున్నారు. క్రీడాకారులకు, మేనేజర్లకు, కోచ్‌లకు ఆహ్వాన కమిటీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. క్రీడా మైదానం ప్రాంగణంలో అధికారులు క్రీడాకారల బరువు నిబంధనల మేరకు ఉందా లేదా అని సరిచూసి నిబంధనల మేరకు బరువు ఉన్న వారికి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత కల్పించారు.

**నాలుగు కోర్టులు ఏర్పాటు**

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల సందర్భంగా రోజుకు 20 మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఇందుకోసం మ్యాట్‌లతో కూడిన నాలుగు కోర్టులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో పోటీలను నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. క్రీడాభిమానులు నాలుగు కోర్టుల్లో జరిగే ఏ మ్యాచ్‌నైనా వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది క్రీడాకారులు తరలి వచ్చారు. తమ అర్హతకు సంబంధించిన పరిశీలన పూర్తిచేసుకున్న తరువాత వారి కోచ్‌లు, మేనేజర్లతో కలిసి పట్టణంలో కలియ తిరిగారు. దీంతో ఎటుచూసినా క్రీడాకారుల కోలాహం నెలకొంది. జాతీయ స్థాయి క్రీడాపోటీలను విజయవంతం చేసేందుకు రాష్ట్రస్థాయి క్రీడా అధికారులు వందమందికి పైగా సిబ్బందిని ఏర్పాటు చేశారు.

**కాగడా చేతపట్టి ర్యాలీలో పాల్గొన్న ఆకేపాటి**



ర్యాలీలో పాల్గొన్న ఆకేపాటి, పోలా

రాజంపేటలో జాతీయ స్థాయి క్రీడాపోటీలు జరిగే విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు శనివారం సాయంత్రం వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు. రాజంపేటలో జాతీయ స్థాయి పోటీలు జరగడం ఈ ప్రాంత వాసులకే కాక జిల్లా ప్రజలందరికి గర్వకారణమన్నారు. ర్యాలీని పురస్కరించుకొని విద్యార్థులు డ్రమ్స్ వాయిస్తూ ముందుకు సాగారు. దారివెంబడి పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ దండు గోపి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, జిల్లా కార్యదర్శి వసంతి, రాజంపేట, నందలూరు, పుల్లంపేట మండలాల విద్యాశాఖ అధికారులు కొండూరు రఘునాధరాజు, నాగయ్య, జి.చక్రధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఐచర్

చింతకొమ్మదిన్నె : కడప- రాయచోటి ప్రధాన రహదారిలోని బుగ్గలేటిపల్లి వద్ద శనివారం ద్విచక్ర వాహనాన్ని ఐచర్ ఆల్విన్ వాహనం ఢీకొంది. సీకే దిన్నె ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపిన సమాచారం మేరకు బుగ్గలేటిపల్లి గ్రామానికి చెందిన కనధం వెంకటరమణ తన ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా రాయచోటి వైపు నుంచి కడపకు వెళ్తున్న ఐచర్ ఆల్విన్ వాహనం వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



వెంకట్రామిరెడ్డి (ఫైల్)

వేంపల్లె : మండలంలోని నందిపల్లె గ్రామం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని పేర్ల వెంకట్రామిరెడ్డి (25) అనే యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వేముల మండలం వి.కొత్తపల్లె గ్రామానికి చెందిన పేర్ల వెంకట్రామిరెడ్డి తన సొంత అవసరాలకు వేంపల్లెకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి తన స్వగృహానికి వెళ్లే క్రమంలో నందిపల్లె గ్రామం వద్ద బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంకట్రామిరెడ్డి బంధువులకు సమాచారం ఇవ్వగా.. హుటాహుటిన ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పూడికతీత పనులు చకచకా

- పీబీసీ కాలువలో 40 కి.మీ మేర పూడిక తొలగించేలా ప్రణాళిక
- వచ్చేనెల 1 నుంచి 10వ తేదీవరకు నీరు నిలిపివేత
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సొంత నిధులతో పనులకు శ్రీకారం



పీబీసీ కాలువలో పూడిక తొలగిస్తున్న జేసీబీ

వేముల : పులివెందుల బ్రాంచ్ కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. ఈ కాలువ కింద 40 కి.మీ మేర పూడిక తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం వచ్చేనెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కాలువకు నీటి సరఫరా నిలిపివేస్తున్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రూ.15లక్షల మేర సొంత నిధులతో ఈ పనులకు శ్రీకారం చుట్టినట్లు పీబీసీ ఈఈ రాజశేఖర్ తెలిపారు. కాగా ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ఆశించిన వర్షాలు లేవు. అంతేకాక అదునులో వర్షాలు లేక అదును తప్పిన వర్షాలతో రైతులు పంటలు సాగు చేసుకున్నారు. పంటలు సాగు చేశాక వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు వాడు దశకు చేరుకున్నాయి. దీంతో రైతులు సాగులో పంటలకు నీటితడులు అందిస్తున్నారు.

### రెండు నెలలుగా నీరు విడుదల

పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు రెండు నెలలుగా నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే పీబీసీ కాలువ అనుసంధానంగా ఉన్న ఉప కాలువలకు నీటిని వదులుతున్నారు. అరకొర వర్షాలకు పంటలు సాగు చేసుకున్న రైతులు కాలువ నీటితో నీటితడులు ఇస్తున్నారు. కాలువ కింద శనగ, నువ్వుల పంట, జొన్న, మినుము తదితర పంటలు సాగులో ఉన్నాయి. వర్షాభావంతో భూమిలో తేమలేక, వర్షాలు లేక పంటలు దెబ్బతింటుండటంతో రైతులు ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్ల ద్వారా పంటలకు నీటి తడులు అందిస్తూ పంటలను కాపాడుకుంటున్నారు.

### 40 కి.మీ మేర పూడిక తొలగింపు

పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో 40 కి.మీ మేర పూడిక తొలగించనున్నారు. కాలువలో వర్షాలకు మట్టి జారి పడటం, జమ్ము పెరిగిపోవడంతో కాలువ పూడిపోయింది. దీంతో పీబీసీ కాలువలో కింది భాగంలోకి నీరు సరఫరా కావడం లేదు. వేముల నుంచి వేంపల్లె మండలానికి మధ్య కాలువ పూడిపోవడంతో నీరు దిగువకు వెళ్లలేదు. దీంతో జేసీబీ సహాయంతో జమ్ము, మట్టిని తొలగిస్తున్నారు. నీరు వదిలిన వెంటనే దిగువకు సకాలంలో నీరు చేరేలా పూడికతీతను తొలగిస్తున్నామని అధికారులు అంటున్నారు.

### 10 రోజులపాటు నీరు నిలిపివేత

పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు 10 రోజులపాటు నీటిని నిలిపివేస్తున్నారు. ఈ వారం రోజులు వేముల, వేంపల్లె మండలాల పరిధిలోని రైతులు కాలువ కింద సాగులో ఉన్న పంటలకు నీటి తడులు ఇచ్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నీరు నిలిపి వేసిన సమయంలో పంటలు దెబ్బతినకుండా రైతు ముందు జాగ్రత్తగా పంటలకు నీటి తడులు ఇచ్చుకోవాలని చెబుతున్నారు. ఈనెల చివరి వరకు నీరు సరఫరా చేస్తామని అవసరమైన రైతులు పంటలకు నీటి తడులు ఇచ్చుకుని సహకరించాలని అధికారులు అంటున్నారు.

### 10రోజులు నీరు నిలిపివేత

పులివెందుల బ్రాంచ్ కెనాల్ కింద 10 రోజుల పాటు నీటి సరఫరాను నిలిపివేస్తున్నాం. పంటలు సాగు చేసుకున్న రైతులు ఈ నెల చివరి నాటికి నీటి తడులు అందించుకోవాలి. కాలువలో పూడికతీత తొలగించే పనులు చేపట్టాం. దిగువకు నీరు వెళ్లక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చేనెల 1వ తేదీనుంచి 10వ తేదీవరకు నీటిని ఆపివేసి పనులను పూర్తి చేస్తాం.. అప్పటివరకు రైతులు సహకరించాలి. 10వ తేదీ తర్వాత యథావిధిగా పీబీసీకి సాగునీటిని విడుదల చేశారు.

– రాజశేఖర్, పీబీసీ ఈఈ, పులివెందుల

### కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సొంత నిధులతో..

పులివెందుల బ్రాంచ్ కెనాల్ కాలువలో పూడికతీత పనులకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రూ.15లక్షల సొంత నిధులతో పనులు చేపడుతున్నారు. రైతుల అవసరాల దృష్ట్యా వేంపల్లె మండలానికి సకాలంలో నీరు చేరకపోవడంతో పంటలకు నీటి తడులు అందించలేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అందుకు అవసరమైన నిధులను సొంతంగా భరిస్తానని కాలువలో పూడికతీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కాలువలో పూడికతీత పనులను ముమ్మరం చేసి సకాలంలో పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

## నవశకం

### నెరవేరిన సొంతింటి కల



పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు సమీపంలోని చౌడమ్మ వీధిలో మేము అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాము. గత కొన్నేళ్లుగా ఇంటి కోసం అనేకమార్లు దరఖాస్తు చేసుకున్నా ఇల్లు మంజూరు కాలేదు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జగనన్న కాలనీల పేరుతో ఊర్లు నిర్మిస్తున్నారు. అందులో మాకు ఇల్లు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఘంటశాల ఇంద్ర, పులివెందుల

### కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు



నాడు-నేడు ద్వారా మోడల్ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారు. ప్రభుత్వం పాఠశాలను నాడు-నేడు కింద మొదటి విడతలో ఎంపిక చేసింది. దీంతో పాఠశాలలో అభివృద్ధి పనులు విరివిగా చేపట్టారు. అలాగే బాలికల హాస్టల్‌కు, పాఠశాలకు ప్రహరీ నిర్మించారు. తరగతి గదుల్లో విద్యార్థుల కోసం కొత్తగా బెంచీలు ఏర్పాటు చేశారు. ఆర్‌ఓ ప్లాంటు ద్వారా విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. విద్యార్థులు చాలా సంతోషంగా పాఠశాలకు వస్తున్నారు. పాఠశాలలో వంట గది వద్ద భోజన నిర్వాహకులకు ఇబ్బంది లేకుండా పనులు చేశారు.

– రామాంజులు నాయక్, ప్రిన్సిపల్, ఏపీ మోడల్ పాఠశాల, పెద్దముడియం

### సులభంగా ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాలు పొందాలంటే నానా కష్టాలు పడాల్సి వచ్చేది. మీసేవలో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ కార్యాలయం, మీసేవ చుట్టూ తిరిగినా సమయానికి అందేవి కావు. పిల్లలకు చాలా ఇబ్బందులు ఉండేవి. అయితే జగనన్న సురక్ష పథకంతో అవసరమైన ధ్రువపత్రాలు గ్రామ వలంటీర్ ద్వారా ఒక్కరోజులోనే అందించారు. పథకాలు ఇంత సులభతరం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– కె. కాంతమ్మ, బోదుమల్లువారిపల్లె, పీలేరు మండలం.



## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మైదుకూరు : మైదుకూరు పట్టణ శివారులోని కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ముమ్మడిబోయిన సుబ్బయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చాపాడు మండలం ద్వారకానగరం గ్రామానికి చెందిన సుబ్బయ్య శనివారం వ్యక్తిగత పనులపై మైదుకూరుకు బైక్‌పై వచ్చి తిరిగి గ్రామానికి వెళుతుండగా శ్రీనగరం సమీపంలో వెనుక వైపు నుంచి వచ్చిన వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో సుబ్బయ్య తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. బాధితున్ని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. సంఘటన స్థలాన్ని మైదుకూరు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## నాగలకుంట్ల వద్ద అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

పోరుమామిళ్ల : మండలంలోని నాగలకుంట్ల వద్ద శనివారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఎవరికీ ప్రమాదం జరగలేదు. శ్రీశైలం నుంచి పోరుమామిళ్లకు వస్తున్న కడప డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నాగలకుంట్ల వద్దకు రాగానే ముందు వెళుతున్న బైక్ హఠాత్తుగా వెనక్కు తిరిగింది. దీంతో వెనుక వస్తున్న బస్సు డ్రైవర్ బైక్‌ను తప్పించేందుకు బ్రేక్ వేసి పక్కకు తిప్పడంతో బస్సు అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో బైక్‌లో వెళుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

## అనారోగ్యంతో కడప మార్కెట్‌యార్డు సెక్రటరీ మృతి



బాలవెంకటరెడ్డి (ఫైల్)

కడప అగ్రికల్చర్/కలసపాడు : కడప మార్కెట్‌యార్డు సెక్రటరీ పాలకొలను బాల వెంకటరెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కడపలో నివాసం ఉన్నప్పటికి జనవరి 26వ తేదీ రిపబ్లిక్‌డే సెలవు కావడంతో తమ సొంత గ్రామమైన కలసపాడు మండలం సిద్ధమూర్తిపల్లెకు వెళ్లారు. ఈయన కడప మార్కెట్‌యార్డులో దాదాపు రెండేళ్ల నుంచి సెక్రటరీగా పనిచేస్తున్నారు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం తెల్లవారుజామున అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం పోరుమామిళ్లకు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

### పలువురి నివాళి

బాలవెంకటరెడ్డిని మృతదేహాన్ని శనివారం ఉదయం కడప నగర మేయర్ సురేష్‌బాబు, బద్వేలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డితోపాటు కడప మార్కెటింగ్‌శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## 50 కిలోల గంజాయి స్వాధీనం

వేంపల్లె : చక్రాయపేట మండలం అద్దాలమర్రి క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శనివారం వాహనాల తనిఖీలలో 50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ గోవిందరెడ్డి వెల్లడించారు. మైదుకూరు నుంచి సత్యసాయి జిల్లా గోరంట్ల ప్రాంతానికి కారులో ఇద్దరు వ్యక్తులు సరఫరా చేస్తుండగా అరెస్టు చేశామన్నారు. వీరు సత్యసాయి జిల్లా రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన దేవరకొండ చిన్న మల్లికార్జున, కూనకుంట్ల గ్రామానికి చెందిన భీంపేట వెంకటనారాయణగా గుర్తించామన్నారు. అలాగే గంజాయి రవాణాకు సహకరించిన మరో ముగ్గురిపై ఆర్‌కే వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌కే వ్యాలీ ఎస్ఐ రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మహబూబ్ బాషా మృతదేహం


జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన జంఖానం మహబూబ్ బాషా (45) అనే వ్యక్తి జమ్మలమడుగు పట్టణం చౌడేశ్వరి ఆలయం వెనుక వైపున అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏఎస్ఐ మురళీ యాదవ్ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. జంఖానం మహబూబ్ బాషా బేల్దారి పనులు చేసుకొని జీవించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది క్రితం భార్య గౌస్ బీ అనారోగ్యంతో మృతి చెందింది. కొన్ని నెలల తర్వాత గౌస్‌బీ సోదరుడు కుల్లాయిబాషా తన చెల్లెలుకు చెందిన ఇద్దరు పిల్లలను, సామగ్రిని తీసుకెళ్లాడు. అనంతరం మహబూబ్‌బాషా పేరుతో ఉన్న ఇంటిని పిల్లల పేరు మీద రాసి ఇవ్వాలని కుల్లాయిబాషా అడిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం మహబూబ్ బాషా బేల్దారి పని మీద జమ్మలమడుగు పట్టణానికి వచ్చాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. శనివారం చౌడేశ్వరి ఆలయం వెనుక మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కడప నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి పరిశీలించారు. మృతుడి తల్లి జమాల్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

## భారీగా అక్రమ మద్యం స్వాధీనం

వేంపల్లె : గోవా రాష్ట్రానికి చెందిన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వేంపల్లె సీఐ చాంద్‌బాషాషా వెల్లడించారు. శనివారం స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద అక్రమ మద్యం సరఫరాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి దాడులు నిర్వహించారు. వేంపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో టీ అంగడి నిర్వహిస్తున్న మోపూరి గంగులయ్య వద్ద అక్రమ మద్యం పట్టుబడినట్లు వివరించారు. సీఐ కథనం మేరకు వేముల మండలం కొండ్రెడ్డిపల్లె గ్రామానికి చెందిన మోపూరి గంగులయ్య వేంపల్లె పట్టణం ఉర్దూ షాదీఖానాలో నివాసముంటున్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో టీ అంగడి నిర్వహిస్తున్నారు. తక్కువ ధరకు గోవా నుంచి మద్యాన్ని తెచ్చి ఇక్కడ అధిక లాభాలకు అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని భావించాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం గంగులయ్య గోవాకు వెళ్లి అక్కడ వివిధ మద్యం దుకాణాల్లో మొత్తం 164 మద్యం బాటిళ్లను రెండు బ్యాగులతో గోవా నుంచి ఎర్రగుంట్లకు రైలు ద్వారా అలాగే అక్కడ నుంచి వేంపల్లెకు తీసుకొచ్చాడు. శనివారం వాటిని అమ్మేందుకు వెళుతుండగా హనుమాన్ జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు వివరించారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసు సిబ్బందికి రివార్డు అందజేశామని సీఐ చాంద్ బాషా పేర్కొన్నారు.

## ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన అవసరం

**– శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్**



సమావేశంలో మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : ప్రజా వినియోగిత సేవల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ప్రజా వినియోగిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్మినెంట్ లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదుదారులకు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయం అందిస్తామన్నారు. 9963731698 నంబర్‌కు ఫోన్ చేసి చట్టంపై అవగాహన పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసమూర్తి, కరస్పాండెంట్ ఫాదర్ ఆరోగ్యస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు, పర్మినెంట్ లోక్ అదాలత్ సభ్యుడు ఎంపీ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## కేతు కుటుంబానికి సాక్షి డైరెక్టర్ పరామర్శ



కేతు ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ ఈశ్వర ప్రసాద్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని రంగాసాయిపురం గ్రామానికి చెందిన ప్రముఖ కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డి కుటుంబాన్ని సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వర ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. గత ఏడాది కేతు విశ్వనాథరెడ్డి మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారం రంగాసాయిపురం గ్రామంలో ఉన్న విశ్వనాథరెడ్డి తమ్ముడు కేతు ప్రభాకర్‌రెడ్డిని ఆయన పరామర్శించారు. తాను తిరుపతిలో చదువుతున్న సమయంలో కేతు విశ్వనాథరెడ్డి ప్రొఫెసర్‌గా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. మంచి రచయితగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. అలాగే కేతు ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం సిర్రాజుపల్లె, ఎర్రగుంట్లలో పలువురు స్నేహితులు, బంధువులను ఈశ్వర ప్రసాద్‌రెడ్డి కలిశారు. ఈ కార్యక్రమంలో యర్రంరెడ్డి వీరభద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

## రూ.9లక్షల నగదు సీజ్

ముద్దనూరు : స్థానిక పోలీసులు శనివారం సాయంత్రం సుమారు రూ.9లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ముద్దనూరు వద్ద వాహనాల తనిఖీలో ఈ నగదు పట్టుకున్నట్లు తెలిసింది.

## ఎక్సైజ్ శాఖలో పలువురు సీఐ, ఎస్ఐల బదిలీలు

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లా ఏపీఎస్‌బీసీఎల్‌కు చెందిన ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్ఐలను బదిలీ చేస్తున్నట్లు శనివారం ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే చోట మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీఐ, ఎస్ఐలకు స్థాన చలనం కల్పించారు.

| సీఐ పేరు | పస్తుత ప్రాంతం | బదిలీ అయిన ప్రాంతం |
|---|---|---|
| ఎస్. సరళాదేవి | ఏపీఎస్‌బీసీఎల్, ఐఎంఎఫ్‌ఎల్ డిపో కడప | ఏసీ విజిలెన్స్ చిత్తూరు |
| సీవీ సురేంద్రారెడ్డి | ఐఎంఎఫ్‌ఎల్ డిపో ప్రొద్దుటూరు | డిస్టిలరీ వింగ్ |
| ఎస్ఐలు | | |
| ఎస్. జహీర్ అహ్మద్ | ఐఎంఎఫ్‌ఎల్ డిపో, కడప | ఏసీ విజిలెన్స్, అనంతపురం |
| వై. సిద్దయ్య | ఐఎంఎఫ్‌ఎల్ డిపో, ప్రొద్దుటూరు | ఏరోమో ఐఎంఎఫ్‌ఎల్ డిపో, నంద్యాల |
| పీఎస్ అమీర్ ఖాన్‌బాషా | ఐఎంఎఫ్‌ఎల్ డిపో, ప్రొద్దుటూరు | ఏరోమో ఐఎంఎఫ్‌ఎల్ డిపో, నంద్యాల |
| పి. కవిత | ఐఎంఎఫ్‌ఎల్ డిపో, ప్రొద్దుటూరు | ఏరోమో ఐఎంఎఫ్‌ఎల్ డిపో, నంద్యాల |
| టి. సతీష్ | ఐఎంఎఫ్‌ఎల్ డిపో, ప్రొద్దుటూరు, | ఏరోమో ఐఎంఎఫ్‌ఎల్ డిపో, తిరుపతి |
| ఎస్. గౌస్ బాషా | డీపీఈఓ స్క్వాడ్, కడప | ఏరోమో ఐఎంఎఫ్‌ఎల్ డిపో, నంద్యాల |

## చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు



మాజీ సర్పంచ్ దేశాయి ఓబుల్‌రెడ్డి, అనుచరులను పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఖాజీపేట : చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజలు నమ్మడం లేదని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేట మండలం కొమ్మలూరు గ్రామంలో మాజీ సర్పంచ్ దేశాయి ఓబుల్‌రెడ్డి , తన వర్గానికి చెందిన 35 కుటుంబాలతో ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. అందుకే ఆ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. ఇచ్చిన హామీలతో పాటు అందరికి న్యాయం చేసిన సీఎం వైఎస్ జగన్ అన్నారు. అందుకే నేడు ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. ప్రజల సంక్షేమం కోరే జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రజలు అంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, సర్పంచ్ పోతుల రుక్మిణమ్మ, కొమ్మలూరు నాయకులు భాస్కర్‌రెడ్డి, త్రిపురవరం నాగసుబ్బారెడ్డి, భూమిరెడ్డి ఓబుల్‌రెడ్డి, అంజనేయకొట్టాలు సర్పంచ్ పెద్దిరెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాలు చేరిక

కొండాపురం : మండల పరిధిలోని పాతకొండాపురానికి చెందిన వెంకటక్రిష్టయ్య, ఆదినారాయణ, సుబ్బరాయుడు శివయాదవ్, రామలింగ యాదవ్, రఘు యాదవ్, ప్రవీణ్ యాదవ్‌లతో పాటు 50 కుటుంబాల వారు శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి తాము పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు చింతరాజారెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, కొండు వాసుదేవరెడ్డి, మండల అధ్యక్షుడు ఖాదర్‌బాషా, రామాంజులరెడ్డి, కొండు వినోద్ రెడ్డి బుజ్జి, సాయి తదితరులు పాల్గొన్నారు